

చేతిరాతకు పదును పెడదాం
విద్యార్థి కెరీర్‌లో మంచి చేతిరాత చాలా ముఖ్యం. అందువల్ల చేతిరాతను మెరుగు పరుచుకునేందుకు కొన్ని చిట్కాలు పాటిం చాలని నిపుణులు సూచిస్తున్నారు. - 10లో



మహిళలకు ఆపన్నహస్తం
ఆపదలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ఆపన్నహస్తం అందిస్తోందని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.9 /21.6
జిల్లాలో సోమవారం 19.4 - 32.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నూతన కార్యవర్గాల ఎన్నికకు ఆమోదం

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం తాలుకా యూనిట్లు, పరిషత్తు యూనిట్, జిల్లా యూనిట్ల పదవీకాలం ముగిసిందని ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకా మల్లేశ్వరరెడ్డి తెలిపారు. అయితే సదరుస్థానంలో నూతన కార్యవర్గాలను ఎన్నుకోవడానికి రాష్ట్ర సంఘం ఆమోదం తెలిపిందన్నారు. దీంతో జిల్లాలో సంఘం ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందువల్ల పీఆర్ ఉద్యోగులు సంబంధిత తాలుకా, పరిషత్ యూనిట్లతో సభ్యులుగా నమోదు చేసుకొని ఎన్నికలకు సన్నద్ధం కావాలని కోరారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : 'స్పందన' కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జేసీ గణేష్ కుమార్ గణేష్ కుమార్, డ్వామా పీడీ యదుభూషణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యుషలు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు.


ఎల్ఎస్ఎస్‌గా పదోన్నతులు



పదోన్నతుల నియామక పత్రాలను అందజేస్తున్న డాక్టర్ రత్నకుమారి


కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్-4) పరిధిలో సోమవారం ఎంఎస్‌డబ్ల్యూ (మెడికో సోషల్ వర్కర్) గ్రేడ్-2 నుంచి లెక్చరర్ ఇన్ సోషల్ సైన్సెస్ (ఎల్ఎస్ఎస్)గా పదోన్నతులు కల్పించారు. మొత్తం ఐదుగురికి ఎల్ఎస్ఎస్‌గా పదోన్నతులు కల్పించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ అధికారుల ఆదేశాలు, నిబంధనల ప్రకారం ఉద్యోగులకు పదోన్నతులు కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అతావుల్లా, బత్తనయ్య, వనీష తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



రాయచోటి అర్బన్ : ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రెడ్డిపద్మజ సోమవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, ఏపీ వేర్‌హౌస్ కార్పొరేషన్ ఎండీ ఓంకార్‌రెడ్డిలు ఆమెకు శాలువా కప్పి పూలబొకేతో సన్మానించారు. రెడ్డిపద్మజ సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బరుగు రెడ్డెన్న కుమార్తె.

ప్రకృతి వ్యసాయం లాభదాయకం



కూరగాయలు విక్రయిస్తున్న సభ్యులు

రాయచోటి టౌన్ : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం అన్నమయ్య జిల్లా పథకం మేనేజర్ రామకృష్ణంరాజు పేర్కొన్నారు. సోమవారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేంద్రియ వ్యవసాయ పద్ధతి ద్వారా పండిన పంటలను పరిచయం చేయడానికే అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూరగాయలు రైతుల నుంచి నేరుగా సేకరించి విక్రయిస్తున్నామని, దీనివల్ల రైతులకు అధిక లాభాలు వస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను తిని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.

అతివలకు ఆసరా

పాదయాత్రలో అక్క చెల్లెమ్మల కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. మహిళాభ్యుదయం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన వెంటనే వారి కోసం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలులోకి తెచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఈమేరకు ఇప్పటికే మూడు విడతల్లో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు నిధులను విడుదల చేశారు. తాజాగా మంగళవారం నాలుగో విడత విడుదల చేయనున్నారు. తద్వారా ప్రభుత్వం మహిళా సాధికారతే ధ్యేయంగా అడుగులు వేస్తోందనే ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

- మహిళా సాధికారతే ప్రభుత్వ సంకల్పం
- నేడు 'వైఎస్సార్ ఆసరా'నాలుగో విడత నిధుల విడుదల
- 30,635 ఎస్‌హెచ్‌జీ సంఘాల్లోని 2,97,036 మందికి ప్రయోజనం



ఈమె పేరు నాగలక్ష్మి. మైలవరం మండలం, వేపరాల గ్రామం సాయిక్రిష్ణ ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు. ఈమెకు వైఎస్సార్ ఆసరా కింద ఒక విడతకు రూ 9,600 చొప్పున మూడు విడతలు తీసుకుంది. నాలుగో విడతగా మరో రూ 9,600 తీసుకోనుంది. ఈ ఆసరా డబ్బులతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం బ్యాంకుల సహకారంతో సమోసాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంది. ఆర్థిక ప్రగతిని సాధిస్తోంది. ఆసరా పథకం ద్వారా మా జీవితాల్లో ఆర్థిక వెలుగులు సంతరించుకున్నాయని నాగలక్ష్మి సంతోషంగా చెప్పింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.



స్వయం సహాయక మహిళా సంఘం

కడప రూరల్ : అక్కచెల్లెమ్మల ఆర్థిక ప్రగతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. తాను అధికారంలోకి రాక ముందు స్వయం సహాయక సంఘ సభ్యులు(ఎస్‌హెచ్‌జీ) ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులను పరిశీలించారు. దీంతో 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి సంఘ సభ్యులు తీసుకున్న రుణం, అప్పటికున్న అప్పు నిల్వ మొత్తం ఎంత ఉన్నా నాలుగు విడతల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక 'వైఎస్సార్ ఆసరా పథకం'కింద విడతల సభ్యులకు చెల్లించాల్సిన మొత్తాన్ని పొదుపు ఖాతాలలో జమ చేస్తున్నారు .

మొత్తం రూ 1025.08 కోట్ల ప్రయోజనం

నిబంధనల ప్రకారం మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న 30,635 సంఘాల్లోని 2,97,036 మంది సభ్యులకు నాలుగో విడతగా రూ 256.27 కోట్ల నిధులను ప్రభుత్వం జమ చేస్తోంది. దీంతో నాలుగు విడతలకు గాను సంఘ సభ్యులకు మొత్తం రూ 1025.08 కోట్ల ప్రయోజనం చేకూరింది. ఈ నిధులతో చాలా మంది సభ్యులు కిరాణా, చీరలు తదితర వ్యాపారాలు చేసి ఆర్థికంగా బలోపేతం అయ్యారు. అందుకు ప్రభుత్వం కూడా సహకరించింది.

టీడీపీ పాలనలో చిన్నాభిన్నం....

గత తెలుగుదేశం పార్టీ పాలనలో ఎస్‌హెచ్‌జీ ఆర్థిక ప్రగతి అస్తవ్యస్తంగా మారింది. చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటను ఏనాడు నిలబెట్టుకోలేదు. దీంతో సంఘ సభ్యులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక సభ్యులకు పలు రకాలుగా ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతున్నాయి.

ఆర్థికంగా పురోగతి సాధించాలి



వైఎస్సార్ ఆసరా నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే కార్యక్రమంలో విడుదల చేస్తారు. జిల్లాలో ఈ నెల 24 నుంచి నిర్దేశించిన తేదీల్లో ప్రాంతాల వారీగా నిధులు జమ అవుతాయి. ఆసరా నిధులను సభ్యులు ఆర్థిక ప్రగతికి వినియోగించుకోవాలి. ప్రభుత్వం కల్పించిన 'ఆసరా'తో ముందుడుగు వేయాలి. - ఆనంద్ నాయక్, పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

సర్వహంగులతో గండిక్షేత్రాన్ని జాతికి అంకితం చేస్తాం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



చక్రాయపేట : గండి క్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి సర్వ హంగులు దిద్దుకున్నాక జాతికి అంకితం చేస్తామని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం గండి నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి,వేంపల్లె జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ రెడ్డిలతో కలసి హాజరయ్యారు.ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గండి క్షేత్రం అభివృద్ధి చెందిందని చెప్పారు.అప్పట్లోనే టూరిజం రెస్టారెంట్,భక్తులు,అర్చకుల వసతి గృహాలు,సిమెంట్ రోడ్లు, పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం వంటి పనులు జరిగాయని చెప్పారు.ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు గండిపై శీతకన్ను వేశాయన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఆలయం పునర్నిర్మాణానికి రు.16 కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. అలాగే రాజగోపురం,ప్రహారీ నిర్మాణానికి కూడా మరో రు.6కోట్ల మేర నిధులు మంజూరు చేశారన్నారు. మళ్లీ అధికారం లోకి రాగానే రెండు విడతల్లో గండిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. మొదటి విడతలో భక్తుల సౌలభ్యం కోసం వంద గదుల నిర్మాణాం,రెండో దశలో గండిలోని టూరిజం రెస్టారెంట్‌ను పూర్తి చేస్తామని వివరించారు.

- గండి క్షేత్రంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి రూ.23 లక్షలు విరాళంగా అందజేశారు.
- గండి అభివృద్ధికి నూతన పాలక మండలి శ్రమించాలని ఎంపీ అన్నారు. అంతకుముందు ఎంపీ గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముకుందారెడ్డి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.ప్రత్యేక పూజలు చేయించారు. కుడా చైర్మన్ గురుమోహన్,ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ప్రసాదరావు, చక్రాయపేట, వేంపల్లె ఎంపీపీలు మాధవీబాలకృష్ణ,గాయత్రి,వేంపల్లె మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి,మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి,కందుల నాని పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటుపడుతాం

చక్రాయపేట : గండి క్షేత్రం అభివృద్ధికి పాటు పడతామని ఆలయ నూతన చైర్మన్ కావలి కృష్ణతేజ, పాలక మండలి సభ్యులు అన్నారు.సోమవారం గండి పాలక మండలి సభ్యులు ఆలయ సహాయ కమిషనర్ ముకుందారెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి, రవికుమార్ రెడ్డిల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా కృష్ణతేజ, పాలకమండలి సభ్యులుగా సుబ్బిరెడ్డిగారి జయమ్మ,కొప్పల మునీశ్వరి,ముద్దికుమారి,బుక్కే లలితమ్మ, కలమల సోమాకళావతి,బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి,పబ్బతి బిందుసాగర్,రాసినేని మధు,బోరెడ్డిగారి వెంకట రామిరెడ్డి,నారుబోయిన సుగుణమ్మ, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ప్రధాన అర్చకుడు కేసరి ప్రమాణ స్వీకారం చేశారు.మార్లెమడక సర్పంచ్ నరసింహులు,ఎంపీటీసీ సభ్యురాలు శాంతమ్మ,పులివెందుల నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి,ఆలయ మాజీ చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, మండల యూత్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న గండి పాలకమండలి చైర్మన్, సభ్యులు

ఎన్నికలకు సంసిద్ధం కావాలి

కలెక్టర్ విజయరామరాజు



కడప కోటిరెడ్డిసర్కిల్ : రానున్న ఎన్నికలకు ముందస్తుగానే సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సభా భవనంలో ఎన్నికలు, ఆడుదాం ఆంధ్ర, కుల గణన, గడపగడపకు మన ప్రభుత్వం పనులు, ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డు పంపిణీ తదితర అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి విజయరామరాజు మాట్లాడుతూ జిల్లా అధికారులు ఎన్నికల పోలింగ్ సిబ్బందికి సంబంధించి వివరాల సేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్లు భరద్వాజ, ప్రత్యూష, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలను అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు.సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లాలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్-2024 రూపకల్పనలో భాగంగా జిల్లాలో జరిగిన వివిధ కార్యకలాపాలు, ఫారం 6, 7, 8 లకు పరిష్కారాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మల్లికార్జున (వైఎస్సార్‌సీపీ), లక్ష్మణరావు (భాజపా), హరిప్రసాద్, జీలనీబాషా(టీడీపీ), కానుగ దానం(బీఎస్పీ), పాల్ సుధాకర్ (ఐఎన్ సి), చంద్రశేఖర్ (సీపీఐఎం), కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

- మొత్తం ఓటర్లు 16,16,509
- ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శన

కడప సెవెన్‌రోడ్స్ : భారత ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 కార్యక్రమం పూర్తయింది. అక్టోబరు 27న ముసాయిదా జాబితా విడుదల కాగా, సోమవారం జిల్లా ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి విడుదల చేశారు. ఓటర్ల జాబితాలను జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఓటరు నమోదు అధికారి, సహాయ ఓటరు నమోదు అధికారి కార్యాలయాల్లో, ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించారు. ప్రజలు ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు ఈ అవకాశాన్ని కల్పించారు. తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 1616509 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 791108 మంది కాగా, మహిళలు 825177, ట్రాన్స్‌జెండర్స్ 224 మంది ఉన్నారు. ఓటర్ల జాబితాను పరిశీలిస్తే పురుషుల కన్నా 34,069 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక సర్వీసు ఓటర్లు 2378 మంది ఉండగా, అందులో పురుషులు 2313, మహిళలు 65 మంది ఉన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య ఇలా ఉన్నాయి.

నియోజకవర్గ వారీగా తుది ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
124-బద్వేలు	108673	109089	07	217769
126-కడప	133890	140248	88	274226
129-పులివెందుల	110829	116605	19	227453
130-కమలాపురం	98,037	102151	34	200222
131-జమ్మలమడుగు	117067	123751	17	240835
132-ప్రొద్దుటూరు	119680	126995	51	246726
133-మైదుకూరు	102932	106338	08	209278

సర్వీసు ఓటర్ల వివరాలు


నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
బద్వేలు	925	26	951
కడప	77	09	86
పులివెందుల	398	05	403
కమలాపురం	223	07	230
జమ్మలమడుగు	262	06	268
ప్రొద్దుటూరు	141	02	143
మైదుకూరు	267	10	277

రాజీవలోచన..కౌసల్యనందన..

శ్రీరాముడు..భక్తుల ఆరాధ్యదేవుడు..ఊరూరా కొలువై పూజలందుకుంటున్నాడు. జన్మస్థలపమైన అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని పట్టణాలు, పల్లెల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో నీలమేఘశ్యామున్ని స్మరించుకున్నారు. శ్రీరామ జెండాలతో బైక్‌ర్యాలీ నిర్వహించారు.అయోధ్య ఉత్సవాన్ని తిలకించదానికి పలుచోట్ల భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఎల్ఈడీ స్క్రీన్‌పై శ్రీరామ విగ్రహ ప్రతిష్టను తిలకిస్తూ భక్తులు ఆనంద పారవశ్యంతో రాజీవలోచన..కౌస్యలనందన శ్రీరామ అంటూ నినాదాలు చేశారు. మరికొందరు జగదభిరాముడిని స్తుతిస్తూ భక్తిగీతాలను ఆలపించారు. - సాక్షి నెట్‌వర్క్



కడపలో బాలరాముని విగ్రహ ప్రతిష్టను ఎల్ఈడీ స్క్రీన్‌పై చూస్తున్న భక్తులు



కడప: రామయ్యా..కరుణ చూపవయ్యా అంటూ మొక్కుకుంటున్న భక్తులు



పులివెందుల వేంకటరమణుడి ఆలయంలో గడ్డితో ఏర్పాటు చేసిన శ్రీరాముని నామం



ప్రొద్దుటూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కడప: పాలకొండల వద్ద ఉన్న నగరవనం కొండపై రామజ్యోతికి భక్తుల పూజలు

ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష

చింతకొమ్మదిన్నె : మండలంలోని చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన గజ్జల బావరెడ్డి గారి సుబ్బారెడ్డి అనే వ్యక్తికి మూడు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు, ఐదువేల రూపాయలు జరిమానా ఎక్సైజ్ కోర్టు విధించినట్లు సీకే దిన్నె ఎస్‌ఐ బి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. 2019 వ సంవత్సరంలో ఆటోను నిర్లక్ష్యంగా తోలి రోడ్డు ప్రమాదానికి కారణమైన సంఘటనలో గజ్జల ఓబుల్ రెడ్డి అనే వ్యక్తి మృతి చెందాడు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు రుజువు కావడంతో ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమ స్రవంతి జానకిరామ్ ఈమేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

అట్లూరు : మండల పరిధిలోని కడప - బద్వేలు ప్రధాన రహదారిపై రెడ్డిపల్లె వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు మండల పరిధిలోని గుజ్జలవారిపల్లె గ్రామానికి చెందిన గోపాలక్రిష్ణ, నరేష్‌లు ద్విచక్ర వాహనంపై సొంత పనుల నిమిత్తం రెడ్డిపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా పాల ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాలక్రిష్ణ, నరేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 వాహనానికి సమాచారమివ్వడంతో వారిని కడప రిమ్స్‌కు తరలించారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

జమ్మలమడుగు రూరల్ : తెలంగాణ రాష్ట్రానికి చెందిన 30 మద్యం బాటిళ్లను పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కరుణాకర్ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ పరిధిలోని కన్నెలూరు గ్రామానికి చెందిన అట్లా రామిరెడ్డి వద్ద అక్రమ మద్యం ఉన్నట్లు సమాచారం రావడంతో సోమవారం పోలీసులు దాడి నిర్వహించారు.

చేతిరాతకు పదును పెడదాం

నేడు జాతీయ చేతిరాత దినోత్సవం



రాజంపేట రూరల్ : విద్యార్థి కెరీర్‌లో మంచి చేతిరాత చాలా ముఖ్యం. చేతిరాత బాగుంటే మంచి మార్కులు వస్తాయి. కొన్నిసార్లు చేతిరాత సరిగా లేకుంటే సమాధానం సరైనదే అయినా మార్కులు కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందు వల్ల చేతిరాతను మెరుగుపరుచుకునేందుకు కొన్ని చిట్కాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

- రోజూ కొంత సమయం చేతితో ఏదో ఒకటి రాయాలి. ఇలా చేయడం వల్ల రాత మెరుగుపడేందుకు దోహదం చేస్తుంది.
- విద్యార్థులు పెన్ను ఎలా పట్టుకోవాలో కొన్ని చిట్కాలు పాటించాలి. పిల్లలు హోంవర్క్ చేసేటప్పుడు, రాసేటప్పుడు సరిగ్గా కూర్చోవాలని చెబుతున్నారు.
- కూర్చునే భంగిమ కూడా చేతిరాతను ప్రభావితం చేస్తుంది. రాయడానికి నిటారుగా కూర్చోవాలి. లేకపోతే మణికట్టుకు బదులు వేళ్లపై ఒత్తిడి పడుతుంది.
- పెన్ను ఎంచుకోవడం చాలా అవసరం. ఇది పిల్లలకు వారి రచనపై మరింత నియంత్రణ ఇస్తుంది. రాసేటప్పుడు పేపర్ అడుగున ప్యాడ్ ఉంచాలి. నిదానంగా, తొందరపడకుండా, ప్రశాంతంగా రాస్తే చేతిరాత బాగుంటుంది.
- చేతి రాత మనిషి నుదిటిపై దేవుడు రాసిన రాతను తెలియజేస్తుందని పురాణాలు తెలియజేస్తున్నాయి. కంప్యూటర్ యుగంలోను చేతిరాతకు విశిష్టత ఉందని పరిశోధకులు పేర్కొంటున్నారు. అందమైన చేతి రాతను శాస్త్రీయ పద్ధతి ప్రకారం స్ట్రోక్స్‌తో సాధన చేయడం వలన విద్యార్థులు చదువులో, పరీక్షలలో మంచి మార్కులు సాధించవచ్చని వారంటున్నారు. వ్యక్తిలోని నిర్లక్ష్యాన్ని, కోపాన్ని, సోమరితనాన్ని, సృజనాత్మకతను, పట్టుదలను, కోరికలను చేతిరాత ద్వారా అంచనా వేసే పద్ధతే గ్రాఫాలజీ. చేతిరాతలోని అక్షరాలు, వాటి పరిమాణం, అక్షర నిర్మాణం, రాసే పంక్తులకు ఇవ్వాల్సినంత దూరాన్ని పాటిస్తే ఎవరి చేతరాత అయినా చూసేందుకు అందంగా, అర్థవంతంగా ఉంటుందనేది పరిశోధకుల అభిప్రాయం. మన సంతకం ద్వారా కూడా వ్యక్తిత్వాన్ని గ్రాఫాలజీ గుర్తిస్తుంది. అనేకమైన మార్పులను మన చేతిరాతలో తీసుకున్నప్పుడు మనం కూడా ఆలోచనా విధానాన్ని మార్చుకోవచ్చని నూతన పరిశోధకులు సైతం వెల్లడిస్తున్నారు.

చేతిరాతపై మీ అందమైన భవిష్యత్తు



మీ చేతిరాత మీ అందమైన భవిష్యత్తును తెలియజేస్తుంది. ప్రత్యేకంగా సాధన చేస్తే సాధ్యం కానిది ఏదీలేదు. పరీక్షల్లో మార్కులు చేతిరాత మీదే ఆధారపడి ఉంటాయి. ఈ విషయంలో విద్యార్థులు శ్రద్ధ వహిస్తే వారి ఉజ్వల భవిష్యత్తుకు దోహదం చేస్తుంది. నేను కొన్ని వేల మందికి చేతిరాతపై శిక్షణ ఇచ్చాను. అది వారికి ఎంతో ఉపయోగపడింది.

-డాక్టర్ కాశీగారి ప్రసాద్, చేతిరాత, వ్యక్తిత్వ వికాస నిపుణులు, రాజంపేట

ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్నహస్తం



బాలికతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్/అర్బన్ : ఆపదలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ఆపన్నహస్తం అందిస్తోందని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫకృద్దీన్ తెలిపారు. సోమవారం కడప నగర శివార్లలోని రిమ్స్, వన్‌స్టాప్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాప్ సెంటర్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జడ్జి రిజిస్టర్లను పరిశీలించారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో అత్యవసరమైన స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు అందిస్తున్నారన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు , బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాలు వంటి సందర్భాలలో మహిళలు వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. మహిళలు 181 ఉమెన్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్ తదితర టోల్ ఫ్రీ నెంబర్‌లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం జడ్జి బాబా ఫకృద్దీన్ రిమ్స్‌లో పర్యటించి పలు విభాగాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ రిమ్స్ డాక్టర్ జి.వి. రమాదేవి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర రెడ్డి, మెడికల్ అండ్ హెల్త్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కడప మార్కెట్‌యార్డులో యధావిధిగా పసుపు కొనుగోలు



మార్కెట్‌యార్డు సెక్రటరీ వెంకటరెడ్డి

కడప అగ్రికల్చర్ : కడప మార్కెట్‌యార్డులో రైతుల నుంచి పసుపు కొనుగోలును యధావిధిగా కొనసాగిస్తున్నామని మార్కెట్‌యార్డు సెక్రటరీ వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం కడప మార్కెట్ యార్డులోని తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప పసుపు మార్కెట్ యార్డులో ఓ పండ్ల వ్యాపారి కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం కోసం పనులను ప్రారంభించారన్నారు. ఈ విషయమై అప్పట్లో మార్కెట్‌యార్డు పసుపు కొనుగోలు ఏజెంట్లు అభ్యంతరం తెలిపారన్నారు. అయితే మార్కెట్ యార్డు నిబంధనల ప్రకారం పసుపు మార్కెట్‌యార్డులో ఎవరు కూడా పండ్లను నిల్వ ఉంచుకునే కోల్డ్ స్టోరేజీ నిర్మాణ పనులను చేపట్టరాదని ఉందన్నారు. ఈ వ్యవహారంపై మార్కెట్‌యార్డు పసుపు వ్యాపారుల సంఘం ఏజెంట్లు, పండ్ల వ్యాపారి కోర్టును ఆశ్రయించారన్నారు. అయితే దీనిపై రెండు రోజుల క్రితం మార్కెట్ యార్డు పసుపు ఏజెంట్ల సంఘం ప్రతినిధులు మళ్లీ వినతిపత్రం సమర్పించారన్నారు. ఈ విషయమై మార్కెట్‌యార్డు సెక్రటరీ వెంకటరెడ్డి మాట్లాడుతూ శీతల గిడ్డంగి నిర్మాణ పనులకు సంబంధించి కోర్టు నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. మార్కెట్‌యార్డులో జరిగే పనుల నిలుపుదలకు సంబంధించి సర్వాధికారులు యార్డుకే ఉన్నాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులను సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు. అంతవరకు పసుపు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పసుపును యధావిధిగా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

హత్యకేసులో నిందితులకు రిమాండ్

ముద్దనూరు : ఈనెల 15వతేదీన మండలంలోని దేనేపల్లె గ్రామంలో బాలయ్య అనే వ్యక్తి హత్య కేసుకు సంబంధించి నలుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు.

ఒక వర్గానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనే విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది.ఈ నేపథ్యంలో పుల్లయ్య, అంకాలమ్మ, గంగాధర్, శివలు కలిసి బాలయ్యను హత్య చేసినట్లు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ అధికార ప్రతినిధిపై కిడ్నాప్ కేసు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని టీడీపీ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి అలియాస్ తిప్పిరెడ్డిపల్లె దస్తగిరితో పాటు మరో నలుగురిపై త్రీ టౌన్ పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. బాకీ డబ్బు ఇవ్వలేదనే కారణంతో పప్పుల బట్టీ నిర్వాహకుడిని టీడీపీ నాయకులు కిడ్నాప్ చేశారు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు పట్టణంలోని కొంపలపుల్లన్న వీధికి చెందిన కొర్రపాటి మహబూబ్‌బాషా పప్పుల బట్టీ నిర్వహించేవాడు. టీడీపీ అధికార ప్రతినిధి అయిన ఆవుల దస్తగిరి చీటీల వ్యాపారం చేస్తుండటంతో మహబూబ్‌బాషా అతని వద్ద చీటీ వేశాడు. కొన్ని నెలల తర్వాత డబ్బు అవసరం ఉండటంతో 2016లో చీటీ ఎత్తుకున్నాడు. చీటీకి సంబంధించిన డబ్బు చెల్లించినా ఇంకా ఇవ్వాలంటూ దస్తగిరి అతన్ని అడిగేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం దస్తగిరి, అతని కుమారుడితో పాటు కొందరు వ్యక్తులు మహబూబ్‌బాషాను కొట్టడంతో పాటు బెదిరించి కిడ్నాప్ చేసి వాహనంలో తీసుకెళ్లారు. విషయం తెలియడంతో మహబూబ్‌బాషా అన్న జమాల్‌బాషా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన సీఐ వెంకటరమణ ఆవుల దస్తగిరికి సిబ్బంది ద్వారా ఫోన్ చేయించి మహబూబ్‌బాషాను వెంటనే స్టేషన్‌కు తీసుకొని రావాలని చెప్పారు. దీంతో మహబూబ్‌బాషాను తీసుకొని దస్తగిరి, ఆయన అనుచరులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. కొంతసేపటి తర్వాత పోలీస్ స్టేషన్ ఆవరణలో కూర్చున్న తనపై ఆవుల దస్తగిరి కుమారుడు అరుణ్‌తేజా దాడి చేసినట్లు జమాల్‌బాషా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఆవుల దస్తగిరి, ఆయన కుమారుడు అరుణ్‌తేజాతో పాటు మరో ముగ్గురిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. కాగా, ఈ కిడ్నాప్ కేసుకు సంబంధించి ఆవుల దస్తగిరితో పాటు ఆయన కుమారుడు అరుణ్‌తేజా, పాలెం వినోద్‌కుమార్, రామకృష్ణలను పోలీసులు అరెస్టు చేశారు. కాగా చిన్నవిషయానికే తమ పార్టీకి చెందిన దస్తగిరిపై పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారంటూ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తన అనుచరులతో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి



శివశంకరాపురం గ్రామంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం 12వ వార్డులో నివాసం ఉండే సుబ్బరాయుడుతో పాటు మరో 10 కుటుంబాల వారు జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం పార్టీలో చేరిన వారందరికి ఎమ్మెల్యే పార్టీ కండవాను వేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ సాధించేందుకు కృషి చేస్తామని పార్టీ నాయకుడు సుబ్బరాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు డి.సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు కేవీ సుబ్బారెడ్డి, డి.గంగాక్రిష్ణారెడ్డి, ఈశ్వరయ్య, మైనార్టీ నాయకుడు షర్ఫుద్దీన్, మాజీ కౌన్సిలర్ మస్తాన్ పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి: మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామ పంచాయితీలోని శివశంకరాపురం గ్రామంలో సోమవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి పలువురు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన రామక్రిష్ణ, చిన్న రెడ్డెయ్య, రెడ్డెయ్య, వెంకటేష్, సహదేవుడు సహా 15 కుటుంబాల వారిని ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే గ్రామంలో పునర్ నిర్మించిన రాముల గుడిని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, పొలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కమాల్ బాషా, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బిల్లులు లేని రూ. 23 లక్షల నగదు సీజ్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం బిల్లులు లేని రూ. 23 లక్షల నగదును రూరల్ పోలీసులు సీజ్ చేశారు. కొత్తపల్లె సర్కిల్ వద్ద పులివెందుల మండలంలోని తుమ్మలపల్లెకు చెందిన వీరరాఘవరెడ్డి వద్ద రూ. 9.50 లక్షలు, రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద కారులో వెళ్తున్న పులివెందులకు చెందిన ఇంతియాజ్ అనే వ్యక్తి వద్ద నుంచి రూ. 7.50 లక్షలు, రింగ్‌రోడ్డులోని దువ్వూరు క్రాస్ రోడ్డు వద్ద సీకేదిన్నెకు చెందిన అమీమ్ వద్ద రూ. 6 లక్షల నగదును సీజ్ చేశారు. వీరు ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో నగదును ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

కొండాపురంలో రూ.12.85లక్షలు..

కొండాపురం : మండల పరిధిలోని తాడిపత్రి-కడప జాతీయ రహదారిపై వేర్వేరు చోట్ల పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ముచ్చుమర్రి గ్రామ సమీపంలో కొండాపురం పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీ లో నెల్లూరుకు చెందిన ఆర్. నరసింహులు కారులో అనంతపురం నుంచి నెల్లూరు వెళుతుండగా తనిఖీలో రూ 9.70 లక్షలు నగదుకు ఎలాంటి ఆధారాలు చూపలేదు. దీంతో నగదు సీజ్ చేసినట్లు కొండాపురం ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. అలాగే తాళ్లప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్ట్ వద్ద ఓ వ్యక్తి నుంచి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో రూ.3.15 లక్షలు నగదు సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ నగదును తిరుపతి ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐలు పేర్కొన్నారు.

దువ్వూరులో రూ.22.50 లక్షలు..

దువ్వూరు : ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.22.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు దువ్వూరు ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. అక్రమంగా డబ్బు తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ఇడమడక గ్రామ చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. నంద్యాల వైపు నుంచి వస్తున్న కారులో తనిఖీ చేయగా కారు డిక్కీలో రూ.22.50లక్షలు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండటంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నారు. కారులో వెళుతున్న రావుల నరసింహను విచారించగా హైదరాబాద్ నుంచి అన్నమయ్య జిల్లా పీలేరుకు వెళుతున్నట్లు తెలిపాడని ఎస్‌ఐ చెప్పారు. డబ్బును స్వాధీనం చేసుకుని తిరుపతి ఇన్‌కాం ట్యాక్స్ అధికారులకు అప్పగించామన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న మరో లారీ



డ్రైవర్‌ను గ్యాస్ కట్టర్లతో బయటకు తీస్తున్న ఫైర్ సిబ్బంది



ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డ లారీ డ్రైవర్

చింతకొమ్మదిన్నె : కడప-రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వలచెరువు నాలుగో మలుపు వద్ద సోమవారం మరమ్మతులకు గురైన లారీని మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనుక వైపు నుంచి ఢీకొన్న లారీని నడుపుతున్న డ్రైవర్ హైజర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న సీకేదిన్నె పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని హైడ్రాలిక్ కట్టర్లతోపాటు స్ప్రెడర్ సహాయంతో డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. ఈ విషయమై సీకే దిన్నె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో లీడింగ్ ఫైర్ మాన్ అన్వర్ బాషా, సంజీవ రాజు, డ్రైవర్ ఆపరేటర్ గంగాధర్ యాదవ్, ఫైర్ మాన్ మురళీకృష్ణ, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.